


# కరపత్రం

SINCE 2014

ఆదివారం మార్చి 02 2025 | సంపుటి :0 | సంచిక : 139 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# ఇసుక సరఫరా..

## హైదరాబాద్‌కు మూడువైపులా స్టాక్ పాయింట్లు: సీఎం రేవంత్





హైదరాబాద్: ఇసుక, ఖనిజాల అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టే పనులకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) నుంచే ఇసుక సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఖనిజాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు.
"నిర్మాణరంగ సంస్థలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాలి. సరైన ధరలకు సరఫరా చేస్తే అక్రమాలకు ఆస్కారం ఉండదు. హైదరాబాద్ నగరానికి మూడు వైపులా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. క్వారీలకు జరిమానాలపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మైనర్ ఖనిజాల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలి" అని సీఎం ఆదేశించారు.

### గల్లంతైన వారి ఆచూకీ మరికొద్ది గంటల్లో.. ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలపై మంత్రి జూపల్లి



ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరుగుతున్న సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

2లో

### ఏప్రిల్, మే నెలల్లో 44-46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు: హైదరాబాద్ వాతావరణ కేంద్రం



2లో

### అవసరమైతే రాజీనామా చేసి వేరేవాళ్లని గెలిపిస్తా: కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం అవసరమైతే రాజీనామా చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రాష్ట్ర జనాభాలో అధికంగా ఉన్న రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఉండాలని చెప్పారు. సామాజిక సమీకరణాలు అడ్డొస్తే తాను రాజీనామా చేసి.. ఎవరినైనా గెలిపిస్తానన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేయొద్దని కోరారు. పార్టీలోకి ఎవరైనా వస్తే గౌరవం ఇవ్వాలని.. పదవులు కాదన్నారు. ఇటీవల పార్టీలోకి వచ్చినవారికి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ కోసం కష్టపడిన వారిని పక్కనపెట్టడం సరికాదని చెప్పారు.

2లో

# రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- అబద్ధాలు చెప్పినంత మాత్రాన ప్రజల వ్యతిరేకత తగ్గదని, సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మరని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- తెలంగాణలో కేంద్రం రూ.10లక్షల కోట్ల విలువైన పనులను చేపట్టిందని, రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తినని తెలిపారు.
- దేశంలోని 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చామని, రాష్ట్రానికి ఆర్ఆర్ఆర్‌ను మంజూరు చేశామని వివరించారు.



హైదరాబాద్: అబద్ధాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
"రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుంది. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ.10లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించాం. నేను ఇతర కేంద్ర మంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశాను. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని. దేశంలో నిర్మించే 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చాను. రాష్ట్రానికి ఆర్ఆర్ఆర్‌ను కేంద్రం మంజూరు చేసింది. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. వాటిని పక్కన పెట్టి భాజపాపై ఆరోపణలు చేస్తున్నారు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.



### హైదరాబాద్‌లో ఫస్ట్ ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్ మూసివేత

2లో

ప్రపంచదేశాలకు ఆర్థికసాయం అందించే యూఎస్ ఎయిడ్ సేవలను నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీని ప్రభావం హైదరాబాద్‌పైనా పడింది. యూఎస్ ఎయిడ్ నిధులు నిలిచిపోవడంతో హైదరాబాద్‌లో ఓ ట్రాన్స్‌జెండర్ క్లినిక్ మూతపడింది.
నగరంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ఆరోగ్య సంరక్షణ సహాయాలు అందించే మిత్ర్ క్లినిక్ డోర్లు మూతపడ్డాయి. దీన్ని 2021 జనవరిలో స్థాపించారు. ఈ క్లినిక్ దేశంలోని మొట్టమొదటి ట్రాన్స్‌జెండర్ ఆరోగ్య సంరక్షణ కేంద్రం. సాధారణ ఆరోగ్య సంప్రదింపులు, HIV కౌన్సెలింగ్ మరియు చికిత్స, లింగ నిర్ధారణ సేవలు,

# కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్



**కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెండ్ అయ్యారు. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వెల్లడించింది.**

హైదరాబాద్: కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెండ్ అయ్యారు. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వెల్లడించింది. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న కారణంతో తీన్మార్ మల్లన్నకు ఫిబ్రవరి 5న టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరి 12లోపు వివరణ ఇవ్వాలని పేర్కొంది. ఆయన నుంచి ఎలాంటి వివరణ రాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి మల్లన్నను సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి పేరిట ఉత్తర్వులు వెలువడ్డాయి.
ఆ పత్రాలు తగులబెట్టడాన్ని తీవ్రంగా పరిగణించాం: టీపీసీసీ చీఫ్
తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. కులగణన పత్రాలు తగులబెట్టడాన్ని తీవ్రంగా పరిగణించామని చెప్పారు. షోకాజ్ నోటీసుకు తీన్మార్ మల్లన్న సమాధానం ఇవ్వలేదని.. అన్ని అంశాలు పరిశీలించాకే ఆయన్ను సస్పెండ్ చేశామన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా చర్యలు తప్పవని మహేశ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు.

## టన్నెల్ ప్రమాదం

# ఆ నలుగురు ఎక్కడున్నారో గుర్తించాం: మంత్రి జూపల్లి

టన్నెల్ ప్రమాదంలో టన్నెల్ లో చిక్కుకుపోయిన కార్మికులను వెలికితీసేందుకు పనులు వేగంగా జరుగుతున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ర్యాడార్ ద్వారా నలుగురు కార్మికులను లొకేట్ చేసినట్లు తెలిపారు. నలుగురు ఎక్కడున్నారో గుర్తించామని మంత్రి ఆయన తెలిపారు.
మొత్తం 8 మంది కార్మికులలో నలుగురిని గుర్తించామని, మిగతా నలుగురు టీబీఎం మిషన్ అవతలి వైపున ఉన్నట్లు చెప్పారు. ఆదివారం (మార్చి 2) రాత్రి వరకు మిగతా నలుగురి ఆచూకీ లభ్యం అవతుందని మంత్రి తెలిపారు.



2లో

# సంపాదకీయం

## త్రిభాషా విద్యలో హిందీ తప్పనిసరా?

నిష్కారణ యుద్ధాలు ఒక ఉన్నత లక్ష్య సాధనకు సంకల్పించినవి కావు, కాబోవు. అవి పక్షపాత పూరితమైనవి అవడం కద్దు. తాము విశ్వసించే భావజాలానికి మద్దతుగా చేసే యుద్ధాలవి. భారతీయ జనతా పార్టీకి ఇటువంటి నిష్కారణ యుద్ధాలు ప్రారంభించే ప్రవృత్తి బాగా ఉన్నది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అందుకు మంచి ఉదాహరణలు. ఒక అవసరాన్ని తీర్చేందుకు ఉద్దేశించబడినవి కావు ఆ చట్టాలు. హిందువులు, హిందూయేతర మతస్థుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టడం, విభేదాలు సృష్టించే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్%-% భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆ చట్టాలకు ఎనలేని ప్రాధాన్యమిచ్చాయి.కేంద్ర ప్రభుత్వం మరో నిష్కారణ యుద్ధానికి శంఖారావం చేసింది. ఈ తాజా యుద్ధం భాషమీద. 'త్రిభాషాసూత్రం' (టీఎల్ఎఫ్) పేరున ఉన్న పాఠశాల విద్యా విధానాన్ని తొలుత రాధాకృష్ణన్ కమిటీ ప్రతిపాదించింది. ఏ రాష్ట్రమూ దానిని అంగీకరించలేదు, అమలుపరచలేదు. ప్రతిపాదన ప్రతిపాదనగానే ఉండిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలో పాఠశాలల నిర్మాణానికి, ఉపాధ్యాయుల నియామకానికి ప్రభుత్వాలు సహజంగా ప్రథమ ప్రాధాన్యమిచ్చాయి. బాలలు అందరినీ బడులల్లో చేర్పించేందుకు, వారి విద్యాభ్యాసం పాఠశాల విద్య పూర్తయ్యే దాకా కొనసాగేలా చేసేందుకు ద్వితీయ ప్రాధాన్యమిచ్చారు. ఆ తరువాత, కేవలం భాషలు నేర్పడంలోనే కాకుండా గణితం, విజ్ఞానశాస్త్రం, చరిత్ర, భూగోళశాస్త్రం, సాంఘికశాస్త్రం మొదలైన విషయాలలో కూడ బోధన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అధిక ప్రాధాన్యమిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా ఆ విద్యా కర్తవ్యాలు అసంపూర్ణంగా, అసఫలంగా మిగిలిపోలేదూ?భాషా బోధన ఒక ప్రమాదకర అంశంగా పరిణమించింది. అందుకు కారణం విద్యా సంబంధితమైనది కాదు. రాజ్యాంగ అధికరణ 343 వల్ల ఆ సమస్య ఏర్పడింది హిందీ దేశ అధికార భాషగా ఉంటుందని, అయితే ఇంగ్లీషు 15 సంవత్సరాల వరకు పాలన, బోధనా భాషగా కొనసాగుతుందని ఆ అధికరణ పేర్కొంది. ఆ 15 సంవత్సరాల గడువు 1965లో ముగిసింది. ఆ నాటి కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా జనవరి 26, 1965 నుంచి హిందీ ఏకైక అధికార భాష అవుతుందని ప్రకటించింది. హిందీయేతర భాషల వారు తక్షణమే తీవ్రంగా ప్రతిస్పందించారు. నిరసించారు. ఉద్యమించారు. హిందీ వ్యతిరేకత దావానలమయింది. తమిళనాడు భగ్గుమంది. ఒక ద్రావిడ పార్టీ అధికార కేతనం ఎగురవేసింది. హిందీయేతర భాషాలవారు కోరుకున్నంతవరకు ఇంగ్లీషు సహ అధికార భాషగా కొనసాగుతుందని దేశ ప్రజలకు జవహర్‌లాల్ నెహ్రూ హామీ ఇచ్చారు. 1965లో అధికార భాషా సంక్షోభం ముమ్మరమయిన దశలో ఇందిరాగాంధీ, అవును ఆమె ఒక్కరు మాత్రమే, ధైర్యంగా, సాహసోపేతంగా హిందీ దురభిమానులను ధిక్కరించారు. విజ్ఞతతో వ్యవహరించారు. దేశ ప్రజలకు తన తండ్రి నెహ్రూ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఆ హామీకి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. విజ్ఞత ఉన్న రాజనీతిజ్ఞత అది.అది నెహ్రూ హామీయే అయినా అంతకంటే ఎక్కువగా, ముఖ్యంగా పరిపాలనా ఆవశ్యకతలు అధికారభాషలుగా హిందీ, ఇంగ్లీషుకు కట్టుబడి ఉండేలా చేశాయి. ఇతర భారతీయ భాషల వలే హిందీ కూడా సమగ్రంగా వికసించిన భాష కాదు. సైన్స్, న్యాయశాస్త్రం, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు, ఇంజినీరింగ్, విదేశీ సంబంధాలు, అంతర్జాతీయ వ్యవహారాలు మొదలైన వాటిని సమర్థంగా నిర్వహించేందుకు వెసులుబాటు లేని భాష. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా శాసన నిర్మాణానికి, పాలనా వ్యవహారాల నిర్వహణకు ఇంగ్లీషు మీదనే ఆధారపడ్డాయి.ఇదిలావుండగా ప్రభావశీలమైన పర్యవసానాలు బహుముఖీనంగా ఉన్న మూడు పరిణామాలు సంభవించాయి. అవి: ఒకటి%-% 1975లో 'విద్య'ను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు మార్చడం. దీనివల్ల పాఠశాల విద్యకు సంబంధించినంతరవకు రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగిందిబీ రెండు%-% 1991లో మన దేశం ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఆమోదించి, అనుసరించడంబీ దీనివల్ల ఇంగ్లీష్ భాష ప్రాబల్యాన్ని అంగీకరించడం అనివార్యమయిందిబీ మూడు%-% మరిన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలల నేర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేయడం. ఈ డిమాండ్ మరింత అధికంగా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.సరే, ప్రస్తుత వివాదం నూతన విద్యా విధానం%-%2020 లోని వివిధ విషయాలకు, ముఖ్యంగా త్రిభాషా సూత్రంకు సంబంధించినది. ఈ త్రిభాషా సూత్రం ప్రకారం ప్రాంతీయ/ రాష్ట్ర భాషను పాఠశాలల్లో 'ప్రథమ' భాషగా బోధించాలి. ఇంగ్లీషు 'ద్వితీయ' భాష. అయితే 'మూడో' భాష ఏమిటి? కేంద్ర విద్యామంత్రి చిత్తశుద్ధి లేని వాగాడంబర వాదన ఒకటి చేశారు. నూతన విద్యా విధానం ఒక జాతీయ విధానం కనుక ప్రతి రాష్ట్రమూ ఆ విధానాన్ని అమలుపరచడం రాజ్యాంగ విహితమైన బాధ్యత అని ఆయన అన్నారు. అంతేకాకుండా పాఠశాల బాలలకు మూడో భాష కూడా బోధించాలని నూతన జాతీయ విద్యా విధానం నిర్దేశించిందని. అయితే ఆ మూడో భాష విధిగా హిందీ అని స్పష్టీకరించలేదని పేర్కొన్నారు. మరి తమిళనాడు జాతీయ విద్యా విధానాన్ని అమలుపరిచేందుకు, మూడో భాష బోధించేందుకు తమిళనాడు ఎందుకు వ్యతిరేకిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నించడంలో ఆయన చాలా అమాయకత్వాన్ని అభినయించారు.

ధర్మేంద్ర ప్రసాద్ ప్రశ్నకు సమాధానాలు స్పష్టమే: (1) నూతన విద్యా విధానం ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానం మాత్రమే. అది రాజ్యాంగ నిర్దేశితమైనది కాదుబీ (2) తమిళనాడులో ప్రభుత్వాలు మొదటి నుంచి అనుసరిస్తున్న విధానం ప్రభుత్వ పాఠశాలల్లో రెండు భాషల బోధన, మూడు కాదు. రెండు భాషల బోధన మాత్రమే జరగాలని తమిళనాడు ప్రభుత్వాలే కాకుండా తమిళ పౌర సమాజమూ గట్టిగా కోరుతున్నది. అయితే ప్రైవేట్ పాఠశాలలు మూడో భాషగా హిందీ బోధించడం పట్ల తమిళనాడు ప్రభుత్వాలు ఎప్పుడూ ఎటువంటి అభ్యంతరం తెలుపలేదు. అవరోధమూ కల్పించలేదు. తమిళనాడులో సీబీఎస్ఈ (642), ఐసీఎస్ఈ (77), ఐబీ(8)కి అనుబంధంగా ఉన్న అన్ని పాఠశాలల్లోను మూడో భాషగా హిందీ బోధిస్తున్నారు. వేలాది బాలలు హిందీ నేర్చుకుంటున్నారు. దక్షిణ్ భారత్ హిందీ ప్రచార్ సభ ఇత్యాది విద్యా సంస్థల ద్వారా లక్షలాది బాలలు హిందీ నేర్చుకోవడానికి తమిళనాడు ప్రభుత్వాలు ఏ విధంగాను అడ్డుపడడం లేదు.నూతన విద్యా విధానం-2020లో మంచి అంశాలూ ఉన్నాయి, అంగీకారయోగ్యం కాని విషయాలూ ఉన్నాయి.

# ప్రపంచ కర్మాగారంగా భారత్: ప్రధాని మోదీ



ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ప్రపంచ దేశాలు భారత్‌ను ఆసక్తిగా గమనిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ

ప్రపంచ కర్మాగారంగా భారత్ రూపొందుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ దేశాలు కొన్ని దశాబ్దాలుగా భారత్‌ను ఓ ఉప శాఖగా చూశాయని.. కానీ ప్రస్తుతం ఆ విధానం పూర్తిగా మారిపోయిందని పేర్కొన్నారు. దేశ రాజధానిలో నిర్వహించిన ఎన్ఎక్స్‌టీ కాన్‌క్లేవ్‌లో భాగంగా ప్రధాని మాట్లాడుతూ.. భారత్ గురించి చాలా సానుకూల వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని వ్యాఖ్యానించారు.

ప్రపంచ దేశాల ప్రజలు భారత్‌కు రావాలని కోరుకుంటున్నారన్నారు.

ఇన్నేళ్లు శ్రామిక శక్తిగా పేరుపొందిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ శక్తిగా మార్పు చెందిందని మోదీ అన్నారు. సెమీకండక్టర్లు, విమాన వాహక నౌకల తయారీ వంటి వాటిలో వేగంగా అభివృద్ధి చెందుతూ.. ఆటోమొబైల్ ఉత్పత్తిదారుగా మారిందని పేర్కొన్నారు. దేశంలో లభించే సూపర్‌ఫుడ్‌లైన మఖానా, మిల్లెట్‌లు, ఆయుష్ ఉత్పత్తులు, మనం పాటించే యోగా, ధ్యానం వంటి వాటిని విదేశీయులు ఆచరిస్తున్నారన్నారు.

పోక్సో కేసుపై కలెక్టర్ వివాదాస్పద వ్యాఖ్యలు.. బదిలీ వేటు

భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు మూడోసారి పట్టం కట్టడం వారికి తమపై ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోందని సంతోషం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న కొత్త గ్లోబల్ న్యూస్ ఛానల్ దేశం సాధించిన విజయాలను.. స్థానిక ఉత్పత్తులకు ప్రచారం కల్పించాలనే తన ప్రయత్నాన్ని విదేశాలకు తెలియజేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ అభివృద్ధిలో ముందడుగు వేస్తూ అనేక ప్రపంచవ్యాప్త కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోందని అన్నారు. ఇటీవల పెద్దఎత్తున నిర్వహించిన మహాకుంభమేళా భారతదేశం పాటించే నిర్వహణానైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పిందని అన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కాలంచెల్లిన అనేక చట్టాను రద్దు చేసి.. కొత్త వాటిని రూపొందించామని తెలిపారు.

# మణిపుర్ పరిస్థితులపై సమీక్ష.. అమిత్ షా కీలక ఆదేశాలు

**మార్చి 8నుంచి మణిపుర్‌లోని అన్ని మార్గాల్లో ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు.**



దిల్లీ: గత రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో అల్లకల్లోలంగా మారిన మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలోని భద్రతా పరిస్థితులపై ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి..కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మార్చి 8నుంచి రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అడ్డంకులు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

హింసతో రగిలిపోతున్న ఈశాన్య రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంపై అమిత్ షా అధికారులతో చర్చలు జరిపినట్లు సమాచారం. దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో మణిపుర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్మీ, పారామిలటరీ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత అక్కడి పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి.

దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపుర్‌లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నింటినీ అక్కడి గవర్నర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు గవర్నర్ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఏడు రోజులలో దాదాపు 300 ఆయుధాలను ప్రజలు ప్రభుత్వానికి అప్పగించినట్లు సమాచారం.

# ఉత్తరాఖండ్ ఘటనలో నలుగురి మృతి.. మంచు చరియల కింద ఇంకా ఐదుగురు



ఉత్తరాఖండ్ లో గత కొన్ని రోజులుగా మంచు కురుస్తుండటంతో భారీగా మంచు చరియలు విరిగిపడిన సంగతి తెలిసిందే. వాటిని తొలగిస్తున్న కార్మికుల్లో 55 మంది అక్కడే చిక్కుకుపోయారు. నిన్నటి నుంచి కొనసాగుతోన్న సహాయక చర్యల్లో భాగంగా 50 మందిని ఆర్మీ రక్షించింది. అయితే వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండగా.. జోషిమఠ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నలుగురు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. ఇంకా ఐదుగురిని కాపాడేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

బద్రీనాథ్ క్షేత్రానికి సమీపంలో ఛమోలీ జిల్లాలోని మనా గ్రామం వద్ద శుక్రవారం మంచు చరియలు విరిగిపడిన ఘటన చోటుచేసుకుంది. ఇది భారత్-టిబెట్ సరిహద్దులో మన దేశానికి చెందిన చివరి గ్రామం. జాతీయరహదారిపై భారీగా పేరుకుపోయిన మంచుమేటలను సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ) సిబ్బంది తొలగిస్తున్నప్పుడు ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రదేశం సముద్ర మట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో ఉంది. మంచుతో కూడిన వర్షం దట్టంగా కురుస్తుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. నిన్న 33 మందిని, ఈ రోజు 17 మందిని ఆర్మీ కాపాడింది. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో జోషిమఠ్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు భారత ఆర్మీ తెలిపింది.

ఏటా శీతాకాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడటం సాధారణమే. ఈ చరియలు 5 సెకన్ల కాలంలోనే గంటకు 80 మైళ్ల వేగంతో కిందకు జారుకుంటాయి. ఇలాంటి ఘటనల్లో 2.3 లక్షల ఘనపు మీటర్ల వరకూ మంచు విడుదలవుతూ ఉంటుంది. అంటే 20 ఫుట్‌బాల్ మైదానాల్లో 3 మీటర్ల మందం వరకూ కప్పిన హిమంతో సమానమన్నమాట.

# గల్లంతైన వారి ఆచూకీ మరికొద్ది గంటల్లో.. ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలపై మంత్రి జూపల్లి

మొదటిపేజీ తరువాయి

దోమలపెంట: ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరుగుతున్న సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ మరికొద్ది గంటల్లో లభించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. టన్నెల్ వద్ద సహాయక చర్యలను పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. టన్నెల్‌లో మనుషులు ఉన్నట్లు ఆనవాళ్లు కన్పించిన చోట తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిపారు.

"5-8 మీటర్ల మట్టిదిబ్బ కింద నలుగురి ఆనవాళ్లు ఉన్నట్లు స్కానింగ్‌లో కన్పించాయి. మరో నలుగురు సిబ్బంది టన్నెల్ బోరింగ్ మిషన్ కింద ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల్లో మొత్తం 11 విభాగాల వాళ్లు పనిచేస్తున్నారు. పనులు వేగంగా జరగటం లేదని విమర్శిస్తున్నారు. లోపల పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో వారికి తెలియట్లేదు. విమర్శించే వారు లోపలికి వెళ్లి చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. కాళేశ్వరంలో 200 కిలోమీటర్ల సొరంగం తవ్వామని భారాస నేత హరీశ్ రావు అన్నారు. మరి పదేళ్లలో ఎస్ఎల్‌బీసీలో 20 కిలోమీటర్ల టన్నెల్ ఎందుకు తవ్వలేదు? గత పదేళ్లలోనే దీన్ని పూర్తి చేసి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదేమో" అని మంత్రి జూపల్లి తెలిపారు.

# ఏప్రిల్, మే నెలల్లో 44-46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు: హైదరాబాద్ వాతావరణ కేంద్రం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటుందని.. వడగాలులు కూడా తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏప్రిల్, మే నెల వచ్చేసరికి 44 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

1901 నుంచి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ప్రధానంగా దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వెల్లడించింది. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే సూచనలున్నాయని తెలిపింది. 125 సంవత్సరాల సరాసరి సగటు తీసుకుంటే గాలిలో తేమ చాలా తగ్గిందని పేర్కొంది.

# ఆ నలుగురు ఎక్కడున్నారో గుర్తించాం: మంత్రి జూపల్లి

మొదటిపేజీ తరువాయి

పనుల్లో పురోగతి చాలా ఉందని, 150 మంది సింగరేణి కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. గ్యాస్ కట్టర్ల ద్వారా %దీవీ% మిషన్ మొత్తం కట్ చేశామని తెలిపారు.

టన్నెల్ ప్రమాదంపై రాజకీయాలు చేయడం తగదని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి అన్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ %ూాదీజ% టన్నెల్ పనులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఇలాంటి ప్రమాదాన్ని రాజకీయం చేయాలనుకోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు.

# హైదరాబాద్‌లో ఫస్ట్ ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్ మూసివేత

మొదటిపేజీ తరువాయి

చట్టపరమైన, సామాజిక పథకాలు పొందడంలో సహాయం వంటి ముఖ్యమైన సేవలు అందిస్తోంది.

కమ్యూనిటీ ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఈ క్లినిక్?ది కీలక పాత్ర. నెలకు 150 నుండి 200 మంది సేవలు పొందేవారు. అటువంటిది విదేశీ సాయం నిలిచిపోవడంతో మూత పడింది. ఈ క్లినిక్‌లో ఏడుగురు ట్రాన్స్‌జెండర్ ఉద్యోగులు ఉన్నారు. ఇప్పుడు వారి పరిస్థితి ఏంటనేది అయోమయం.

ఎలాన్ మస్క్ స్పందన

భారతదేశపు మొట్టమొదటి ట్రాన్స్‌జెండర్ క్లినిక్ మిత్ర్(%వీఠతీ%) మూతపడటంపై టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ స్పందించారు. "అమెరికన్ పన్ను డాలర్లు నిధులు సమకూర్చేది అదే.." అని ఎక్స్(%శ%)లో ట్వీట్ చేశారు. మస్క్ వ్యాఖ్యలు విమర్శలకు దారితీస్తున్నాయి. దేశంలో ఇటువంటి సేవలు అందిస్తున్న క్లినిక్‌లు మూతపడతాయి అన్నట్లుగా అతని వ్యాఖ్యలు ఉండటమే అందుకు కారణం.

# మంచుచరియల కింద 22 మంది

బద్రీనాథ్ ధామ్‌లో మంచుచరియలు విరిగిపడిన ప్రాంతం నుంచి క్షతగాత్రులను తరలిస్తున్న సైనికులు

దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లో మంచుచరియల్ని తొలగించే పనులు నిర్వర్తిస్తున్న కార్మికుల్లో 55 మంది అనూహ్యంగా వాటికింద చిక్కుకుపోయారు. ఒక్కసారిగా పైనుంచి మంచుపెళ్లలు వారిపై పడిపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. సహాయక బృందాలు 33 మందిని రక్షించగలిగాయి. మిగిలిన 22 మంది ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బద్రీనాథ్ క్షేత్రానికి సమీపంలో ఛమోలీ జిల్లాలోని మనా గ్రామం వద్ద శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇది భారత్-టిబెట్ సరిహద్దులో మన దేశానికి చెందిన చివరి గ్రామం. జాతీయ రహదారిపై భారీగా పేరుకుపోయిన మంచుమేటలను సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ) సిబ్బంది తొలగిస్తున్నప్పుడు దుర్ఘటన జరిగింది. ఈ ప్రదేశం సముద్ర మట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో ఉంది. మంచుతో కూడిన వర్షం దట్టంగా కురుస్తుండటం, చీకటి పడిపోవడం వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఘటనా స్థలికి జాతీయ, రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళాలు (ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్) చేరుకొని సహాయ కార్యక్రమాల్లో మునిగిపోయాయి.

కాపాడినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమీక్షించి కొన్ని సూచనలు చేశారు.

ఆలస్యమయ్యే కొద్దీ ఇబ్బందే

ఏటా శీతాకాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడటం సాధారణంగా మారింది. ఈ చరియలు 5 సెకన్ల కాలంలోనే గంటకు 80 మైళ్ల వేగాన్ని పుంజుకుంటుంటాయి. ఇలాంటి ఘటనల్లో 2.3 లక్షల ఘనపు మీటర్ల వరకూ మంచు విడుదలవుతూ ఉంటుంది. అంటే 20 ఫుట్‌బాల్ మైదానాల్లో 3 మీటర్ల మందం వరకూ కప్పిన హిమంతో సమానమన్నమాట. ఈ హిమ శకలాల్లో చిక్కుకున్న వ్యక్తిని 18 నిమిషాల్లోగా కాపాడగలిగితే బతికిబట్టగట్టేందుకు 91 శాతం అవకాశాలు ఉంటాయి. 35 నిమిషాలు దాటితే బతికే అవకాశాలు 34 శాతానికి పడిపోతాయి.

# సాగునీటి సమస్య తలెత్తితే.. సంబంధిత అధికారులదే బాధ్యత

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టీకరణ...
- అలసత్వాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక...







**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిది**

జిల్లాలో ఎక్కడైనా సాగు నీటి సమస్య ఉత్పన్నమైతే,సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు.విధుల పట్ల అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తూ సాగునీటి సరఫరాను సక్రమంగా పర్యవేక్షించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.బోధన్ పట్టణంలోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి కలెక్టర్ శనివారం ఇరిగేషన్,రెవెన్యూ,వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాజెక్టులు,చెరువులు,కాల్వల కింద ఆయకట్టు కలిగిన పంటల పరిస్థితి, అందుబాటులో ఉన్న సాగునీటి వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు.గతేడాదితో పోలిస్తే ప్రధాన జలాశయాలైన శ్రీరాంసాగర్,నిజాంసాగర్ లతో పాటు చెరువులలో నీటి నిల్వలు ఈసారి ఒకింత ఎక్కువ మొత్తంలోనే అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ గుర్తు చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పంటలకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.నీటి లభ్యత సరిపడా ఉన్నందున సాగు జలాల పంపిణీని పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగు జలాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ జరపాలని, ఎగువ ప్రాంతాలలో నీటి చౌర్యం జరుగకుండా నిఘా కొనసాగించాలని ఆదేశించారు.ఈ విషయంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు.ఎక్కడైనా నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంటే,ముందస్తుగానే గుర్తించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.సమస్య ఏర్పడిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.జిల్లాలో ఎక్కడ కూడా సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు.ప్రస్తుతం పంటలకు సాగు నీటి ఆవశ్యకత ఉంటుందని, వచ్చే నెలన్నర రోజుల పాటు సాగునీటి పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు.సాగునీటి పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇరిగేషన్ సీ.ఈ లకు సూచించారు.సాగు జలాల పంపిణీ రైతులతో,పంటల సాగు అంశాలతో ముడిపడి ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోకూడదని అన్నారు.జిల్లాలో తాగునీటి సమస్య సైతం నెలకొనకుండా అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రస్తుత యాసంగి సీజన్ లో ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.గత సీజన్లతో పోలిస్తే ఈసారి ఎరువులకు పెద్ద ఎత్తున డిమాండ్ నెలకొని ఉందన్నారు.గతేడాది రబీలో 63 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించగా,ఈసారి 77 వేల మెట్రిక్ టన్నులకు ఎరువుల డిమాండ్ పెరిగిందని వివరించారు.దీని దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని రైతాంగం అవసరాలకు సరిపడా ఎరువుల స్టాక్ ను ముందుగానే తెప్పించుకుని,అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

### పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న దృష్ట్యా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ,ప్రైవేట్ రంగాలతో పాటు ఇతర సంస్థల నుండి రావాల్సిన ఆస్తి పన్నును ఆర్థిక సంవంత్సరం ముగిసేలోపు నూటికి నూరు శాతం వసూలు చేసేలా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని,అయినప్పటికీ స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సాంకేతికత సహాయంతో ఆస్తి పన్నును పక్కాగా లెక్కిస్తూ,నూటికి నూరు శాతం వసూలయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాలుర పీ.హెచ్.సీని తనిఖీ చేసిన కలెక్టర్

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిది**







సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఇన్ పేషంట్ వార్డును సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను గమనించారు. రోగులను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఇటీవలి కాలంలో పీ.హెచ్.సీ ని సందర్శించారా అని ఆరా తీశారు. సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కాగా, శిథిల దశకు చేరుకున్న పీ.హెచ్.సీ పాత భవనాన్ని పరిశీలించిన జిల్లా పాలనాధికారి, కొత్త భవనం మంజూరీ వివరాల గురించి ఆరా తీశారు.వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ తదతరులు ఉన్నారు.

# విహెచ్ నివాసంలో సమావేశమైన మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులు



**మహేందర్ కూరపాటి, కరపత్రం ప్రతినిది**

రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో పాల్గొనని వారికి మరింత సమయం కేటాయించాలని శనివారం మున్నూరు కాపు రాజకీయ ప్రతినిధులు మాజీ రాజ్యసభ సభ్యులు విహెచ్ హనుమంతరావు నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల గణన సర్వే చేపట్టడం ఎంతో అభినందనీయమని, మున్నూరు కాపుల కులస్తుల సంఖ్య తెలిసేందుకు ప్రభుత్వం మరింత సమయం ఇవ్వాలని కోరన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేశవరావు,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్,ఆకుల లలిత, గాలి అనిల్ కుమార్, మున్నూరు కాపు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో రెండు ఇండ్లు దగ్ధం...







**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిది**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో రెండు ఇండ్లు దగ్ధమైన ఘటన బోధన్ పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని 29వ వార్డు కుమ్మరి గల్లీ కి చెందిన వెండి సాయిలు పెంకుటిల్లు, ఉద్మీర్ గల్లీ కి చెందిన పెద్ద ఒడ్డెమ్మ రేకుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదానికి గురైంది. స్థానికులు గమనించి అగ్ని మాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే అగ్ని మాపక శాఖ ఎస్ఐ గంగాదాస్, సిబ్బంది నర్సయ్య, వంశీ, వారీస్, గంగారాం లు ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. సంభవించిన పెంకుటిల్లు అగ్ని ప్రమాదంలో లక్ష రూపాయల వరకు, రేకుల ఇల్లు అగ్ని ప్రమాదంలో 3లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు భాధితులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు అగ్ని మాపక శాఖ అధికారి గంగాదాస్ తెలిపారు.

# ఘనంగా మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవం

**కరపత్రం బాన్సువాడ మార్చి 1**




బాన్సువాడ పట్టణంలోని బాబు జీవన్ రావు విగ్రహం వద్ద శనివారం మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవానికి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యూల్ ముఖ్యఅతిథిగా హాజరై అమరులకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మారావు, బాలరాజ్, కాదేపురం గంగన్న, పోచీరం, మహేష్, హన్మాండ్లు, సాయి, డాకయ్య,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవ వేడుకలు...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిది**





మాదిగ అమరవీరుల దినోత్సవ వేడుకలను శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు తాడం అబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో అమరుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసిం గారి భూమయ్య మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ మాటే శిరోధార్యంగా వర్గీకరణనే లక్ష్యంగా కొనసాగుతున్న ఉద్యమ చరిత్ర 31 సం.రాలు అయిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యం కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరుల కలను నేడు నూటికి నూరు శాతం సాకారం చేయడం కోసం,జాతి లక్ష్యం కోసం మంద కృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. వర్గీకరణ పోరాటం సబ్బండ కులాలకు నాయకత్వం వహించేలా, ఎంతో మంది నిరాశ నిస్పృహతో ఉన్న జీవితాల్ని బాగు చేసింది అని అనేక సందర్భాల్లో అభాగ్యులకు అండగా నిలిచిందన్నారు. పోరాటం చేయడానికి మీ త్యాగాల పోరాట పటిమే మా అందరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గోనెవర్ మారుతి మాదిగ, మోచి సంఘం నియోజకవర్గ సీనియర్ నాయకులు సింది శంకర్, కాడి గోల్ల కుమార్ కార్యదర్శి, కిన్నెర మోహన్, సంజు, గంగాధర్, పర్పకోల వినోద్, సాయిలు, శివాజీ, సాయికుమార్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.ఆర్.ఎస్.ను సద్వినియోగం చేసుకోవాలి...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిది**

పట్టణ ప్రజలు ఎల్.ఆర్.ఎస్ ను సద్వినియోగం చేసుకుని 25శాతం రాయితీ ని పొందాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనధికారిక లేఅవుట్ల యందలి ప్లాట్లు, అనధికారిక లేఔట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020 సం.లో ధరఖాస్తు చేసుకున్న వారు మార్చి 31, 2025 లోగా క్రమబద్ధీకరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం (జీవో నెం.28 తేదీ. 20.02.2025) ద్వారా ఆదేశాలు జారీచేసినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దరఖాస్తుదారులకు ఏమైనా సందేహాలు ఉంటే ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ లో తమ సందేహాలను నివృత్తి చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన ఎస్ఆర్ఎస్ లో 25శాతం రాయితీ ని పొంది సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# పదవ తరగతిలో 10 జీపీఏ వస్తే ఫ్లైట్ ట్రిప్

## – విద్యార్థులను ఉత్తేజపరిచిన ప్రధాన ఉపాధ్యాయులు మల్కా

**కరపత్రం రామగిరి ప్రతినిధి మార్చి1**
రాబోయే పదవ తరగతిలో 10 జీపీఏ గ్రేడ్ వస్తే ఉచితంగా ఫ్లైట్ ట్రిప్పు తీసుకెళ్తానని రామగిరి మండలం బేగంపేట జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మల్కారాంకిషన్ రావు ప్రకటించారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శనివారం పదవ తరగతి విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులను విద్యలో ఉత్తేజపరచడానికి తన సొంత ఖర్చులతో ఈ అవకాశాన్ని కల్పించానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం.షేక్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి 10 జీపీఏ ర్యాంకుకు పోటీ పడాలని



ఆయన సూచించారు. విద్యార్థులకు ప్రతి రోజు పౌష్టికాహారం ఇవ్వాలని, సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలని, ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలని ఆయన సూచించారు. సిలబస్ పూర్తి అయిన దృష్ట్యా రివిజన్ జరుగుతుంది. ఈ సందర్భంగా ఉదయం 7:30 నుండి రాత్రి 7.30 గంటల వరకు విద్యార్థులందరినీ పాఠశాలలో చదివిపిస్తున్నామని, దీనికి తల్లిదండ్రులు సహకరించాలని ప్రధాన ఉపాధ్యాయులు మల్కా రాం కిషన్ రావు కోరారు. పదవ తరగతిలో 23 మంది విద్యార్థులు ఈనెల 21వ తేదీ నుండి ఏప్రిల్ 4 వ తేదీ వరకు పరీక్షలు వ్రాస్తారని ఆయన తెలిపారు. ప్రతి ముగ్గురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయున్ని మానిటరింగ్ కింద నియమించామని, వారు ప్రతి విద్యార్థిని ఉదయం 4.30 గంటలకు నిద్ర లేపడం, రాత్రి 9:30 గంటలకు చదువుతున్నారా! లేదా! తెలుసుకోవడం జరుగుతుందన్నారు. బంగారు భవిష్యత్తుకు ఇది తొలిమెట్టు అని, దీనికి తల్లిదండ్రులు పూర్తిగా సహకరించాలని వారు కోరారు. విద్యార్థులు కూడా తాము చదువుతూనే, ఏమైనా విషయాలపై అవగాహన లేకపోతే అడిగి తెలుసుకోవాలని వారు సూచించారు. గత కొన్ని నెలల క్రితం పదవ తరగతి విద్యార్థులకు ప్రధాన ఉపాధ్యాయులు రాం కిషన్ రావు తన మిత్రుల సహకారంతో రూ.45వేల విలువచేసే స్టడీ మెటీరియల్ కార్నర్ కింద అందించారు. విద్యార్థులు ఇంటి వద్ద ఉల్లాసంగా, ఉత్సాహంగా చదువుకోవడానికి ఈ మెటీరియల్ అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజా, శ్రీనివాస్, సంపత్ కుమార్, గీతారాణి, శ్రీదేవి, మంగ, స్వరూప,పీఈటీ శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి :

## – సేవా అధ్యక్షురాలు, ఆర్జీ-3 ఏరియా

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది రామగిరి ప్రతినిధి మార్చ 1**
రామగుండం-3 & అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ఈనెల 8 వ తేదీన స్థానిక కమ్యూనిటీ హాలు నందు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రామగుండం-3 ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్.అలివేణి సుధాకరరావు కోరారు. శనివారం సెంటినరీ కాలనీలోని సేవా భవనంలో సేవా సభ్యులతో మహిళా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన



సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ మార్చి 8 వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక కమ్యూనిటీ హాలు నందు ఉదయం 10:00 గంటలకు వేడుకలు ప్రారంభించబడునని, వేడుకలలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని, ఈ సందర్భంగా రామగుండం-3 %ఀ% అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో మహిళలకు నిర్వహించినటువంటి వివిధ ఆటల పోటీల విజేతలకు బహుమతి ప్రధానం చేయబడునని అన్నారు. కావున సేవా సభ్యులు, సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డిపియం గుర్రం శ్రీహరి, కోఆర్డినేటింగ్ అధికారి పి.రాజేశం, సేవా కార్యదర్శి మల్లీశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా కోఆర్డినేటర్ కె.సుధాకర్, సేవా సభ్యులు,

# పట్టణంలోని శివాలయంలో మధ్యప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) జన్మదిన వేడుకలు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది జమ్మికుంట మార్చి 01**
జమ్మికుంట: పట్టణంలోని శివాలయంలో మధ్యప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నపూర్ణ సేవాసమితి నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ నసీరుద్దీన్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బసంత్ నగర్ కు చెందిన పరికిపండ్ల నరహరి ఐఏఎస్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం



చాలా సంతోషకరంగా ఉందన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూనే ఆలయ ఫౌండేషన్ సంస్థను స్థాపించి పేద ప్రజల కోసం అనేక సామాజిక కార్యక్రమాలు కొనసాగించడం జరుగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు చదువు కోసం ఆర్థిక సాయం అందించడంతోపాటు పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొంది పేద ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని ఆ భగవంతుడు కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సమ్మెట సదానందం నేరెళ్ల రఘుపతి మేకల గణేష్ కొండపాక అశోక్ అబ్బరవేన రాజు, కొంగల కుమార్ ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గుణసాగర్ సభ్యులు ఇంగిలే రామారావు తో పాటు తదితరులు పాల్గొన్నారు

# కేజీబీవీ టెన్త్ క్లాస్ విద్యార్థినిలకు పరీక్ష ప్యాడులు, పెన్నుల పంపిణీ..



## – యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక,మార్చి 1.**
వీణవంక ముద్దుబిడ్డ యుఫ్ టీవీ సీఈఓ పాడి ఉదయనందన్ రెడ్డి( ఫిబ్రవరి 25) జన్మదినాన్ని పురస్కరించుకొని,తాళ్లపెల్లి కుమారస్వామి బ్రైట్ కోఆర్డినేటర్, దాసారపు లోకేష్, వంశీకృష్ణ,సోషల్ మీడియా ప్రతినిధులు అందరు కలిసి, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, కస్తూరిబా గురుకుల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న,మూడు కస్తూరిబా విద్యాలయాలలో 150 మంది విద్యార్థినిలకు 150 పరీక్ష ప్యాడ్స్ 300 పెన్నులను, కేజీబీవీ పాఠశాలలకు వెళ్లి డొనేట్ చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమం ఉద్దేశించి, యుఫ్ టివి సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి విద్యార్థినిలకు పరీక్ష సమయంలో ఒత్తిడి తగ్గించుకొని మంచి ర్యాంకులు సాధించాలని విద్యార్థులందరికీ అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పమని తన అనుచరులతో సందేశం పంపించారు.ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి కుమారస్వామి,దాసారపు లోకేష్,వంశీకృష్ణ,మంతెన శ్రీధర్,తొట్ల రాకేష్, మహంకాళి రాజు,కోరే రాకేష్, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, స్పెషల్ ఆఫీసర్లు లు, టీచర్స్, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# కేజీబీవీ టెన్త్ క్లాస్ విద్యార్థినిలకు పరీక్ష ప్యాడులు, పెన్నుల పంపిణీ..

## – యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక,మార్చి 1.**
వీణవంక ముద్దుబిడ్డ యుఫ్ టీవీ సీఈఓ పాడి ఉదయనందన్ రెడ్డి( ఫిబ్రవరి 25) జన్మదినాన్ని పురస్కరించుకొని,తాళ్లపెల్లి కుమారస్వామి బ్రైట్ కోఆర్డినేటర్, దాసారపు లోకేష్, వంశీకృష్ణ,సోషల్ మీడియా ప్రతినిధులు అందరు కలిసి, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, కస్తూరిబా గురుకుల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న,మూడు కస్తూరిబా విద్యాలయాలలో 150 మంది విద్యార్థినిలకు 150 పరీక్ష ప్యాడ్స్ 300 పెన్నులను, కేజీబీవీ పాఠశాలలకు వెళ్లి డొనేట్ చెయ్యడం







జరిగింది.ఈ కార్యక్రమం ఉద్దేశించి, యుఫ్ టివి సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి విద్యార్థినిలకు పరీక్ష సమయంలో ఒత్తిడి తగ్గించుకొని మంచి ర్యాంకులు సాధించాలని విద్యార్థులందరికీ అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పమని తన అనుచరులతో సందేశం పంపించారు.ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి కుమారస్వామి,దాసారపు లోకేష్,వంశీకృష్ణ,మంతెన శ్రీధర్,తొట్ల రాకేష్, మహంకాళి రాజు,కోరే రాకేష్, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, స్పెషల్ ఆఫీసర్లు లు, టీచర్స్, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# నిరుపేద ఆటో డ్రైవర్ కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం...



## – యువ నాయకులు అమృత ప్రభాకర్..

**కరపత్రం ప్రతినిధి,వీణవంక,మార్చి 1.**
వీణవంక మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ వెంగళ గణేష్ ఇటీవల పక్షవాతానికి గురై,అనారోగ్యానికి బాధపడుతున్న విషయం తెలుసుకున్న, వీణవంక యువ నాయకులు అమృత ప్రభాకర్ మానవతా దృక్పథంతో శనివారం నిరుపేద ఆటో డ్రైవర్ కుటుంబానికి 5,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు అమృత ప్రభాకర్ తో పాటుగా,మోటం సారయ్య, మహబూబ్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం...



## – కొవ్వొత్తులతో నివాళులర్పించిన, ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నాయకులు ..

**కరపత్రయ ప్రతినిధి, వీణవంక, మార్చి 1.**
మాదిగ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పద్మశ్రీ ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, శనివారం వీణవంక మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని, ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి,ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోరే అరుణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కండే మహేందర్, ఎమ్మెస్పి జిల్లా కార్యదర్శి అంబాల మదనయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పర్లపల్లి తిరుపతి, గాజుల శ్రీను, దాసరపు అశోక్, పులి ప్రకాష్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో ఘనంగా సైన్సు దినోత్సవం

**కరపత్రం ప్రతినిధి రామగుండం మార్చి 1**
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్.ఎఫ్. సి. యల్ పట్టణము నందుగల శ్రీ చైతన్య పాఠశాలలో సైన్సు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించటం జరిగింది. -ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి గా ఆర్.ఎఫ్.సి.యల్, సి.జి.యం



ఉదయ్ రాజాన్నా చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థుల్లో అపారమైన శక్తి సామర్థ్యాలు ఉంటాయని -ఉపాధ్యాయులు వారిలో దాగి ఉన్న మేధస్సును, సృజనాత్మకతను వెలికితీసే విధంగా వారి ప్రతిభను గుర్తించి భవిష్యత్తుకు బంగారుబాట వేయాలని చెప్పారు. కార్యక్రమాన్ని -ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ రవి ఇలాంటి వేడుకలు నిర్వహించటం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి వస్తాయని, భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలకు ఇవి ఎంతగానో దోహదపడతాయి అన్నారు. అనంతరం "క్యాట్" పరీక్షలో అద్భుతమైన ప్రతిభకనబరచిన విద్యార్థులకు మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్.ఎఫ్.సి.యల్ సంస్థ అధికారులు ఎస్. ఎన్. సాహు, రమేష్ ఠాకూర్, డీన్ రమేష్, 'సి'బ్యాచ్ బాధ్యులు, ప్రశాంతి, ఎ.ఓ. నరేంద్ర కుమార్, స్రవంతి అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


# కేజీబీవీ టెన్త్ క్లాస్ విద్యార్థినిలకు పరీక్ష ప్యాడులు, పెన్నుల పంపిణీ..

## – యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక,మార్చి 1.**
వీణవంక ముద్దుబిడ్డ యుఫ్ టీవీ సీఈఓ పాడి ఉదయనందన్ రెడ్డి( ఫిబ్రవరి 25) జన్మదినాన్ని పురస్కరించుకొని,తాళ్లపెల్లి కుమారస్వామి బ్రైట్ కోఆర్డినేటర్, దాసారపు లోకేష్, వంశీకృష్ణ,సోషల్ మీడియా ప్రతినిధులు అందరు కలిసి,





జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, కస్తూరిబా గురుకుల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న,మూడు కస్తూరిబా విద్యాలయాలలో 150 మంది విద్యార్థినిలకు 150 పరీక్ష ప్యాడ్స్ 300 పెన్నులను, కేజీబీవీ పాఠశాలలకు వెళ్లి డొనేట్ చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమం ఉద్దేశించి, యుఫ్ టివి సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి విద్యార్థినిలకు పరీక్ష సమయంలో ఒత్తిడి తగ్గించుకొని మంచి ర్యాంకులు సాధించాలని విద్యార్థులందరికీ అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పమని తన అనుచరులతో సందేశం పంపించారు.ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి కుమారస్వామి,దాసారపు లోకేష్,వంశీకృష్ణ,మంతెన శ్రీధర్,తొట్ల రాకేష్, మహంకాళి రాజు,కోరే రాకేష్, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, స్పెషల్ ఆఫీసర్లు లు, టీచర్స్, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.